



హెడ్ పోస్టాఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కార్పొరేట్‌ల కోసమే బడ్జెట్

- వ్యకాస, రైతుసంఘాల నాయకులు
- హెడ్ పోస్టాఫీస్ ముందు ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ గ్రామీణ ప్రజలకు నష్టం కలిగించేదిగా ఉందని, దేశ ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల కోసమే తయారు చేసిన బడ్జెట్‌లాగా ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీలు విమర్శించాయి. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా కర్నూలు నగరంలోని హెడ్ పోస్టాఫీస్ ముందు ఉభయ సంఘాల అఖిలభారత కమిటీల పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు అధ్యక్షత వహించారు. అనంతరం వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో కోతలు విధించారని మండిపడ్డారు. గతేడాది సుమారు రూ.90 వేల కోట్లు కేటాయిస్తే, ఈఏడాది కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. గతేడాది పని చేసిన కూలీలకు వేతనాలు రాలేదని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర వస్తువులు అందించాల్సిన ప్రభుత్వం ఆహార భద్రత చట్టానికి 30 శాతం నిధులను కోత పెట్టిందన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాల్సింది పోయి, కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ బడ్జెట్ అమలయితే పేదలకు బియ్యం కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. అదే జరిగితే గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఆకలి చావులు తప్పవని తెలిపారు. అలాగే వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని ఎన్నికల ముందు చెప్పిన ప్రభుత్వం, ప్రస్తుతం ఇస్తున్న ఎరువుల సబ్సిడీలో కోత పెట్టిందని విమర్శించారు. వ్యవసాయ చట్టాల గురించి మాట్లాడలేదన్నారు. అలాగే రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర గురించి ఊసే లేదని తెలిపారు. గ్రామీణ రైతులు ఏ పంటలు వేస్తే గిట్టుబాటు వస్తుందో తెలియని అయోమయంలో ఉన్నారని చెప్పారు. రైతులకు 'మేమున్నామ'ని భరోసాను కల్పించలేని దీనస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుపై మాటైనా మాట్లాడకపోవడం దారుణమని మండిపడ్డారు. అధికార, ప్రతిపక్ష ఎంపీలు నోరు మెదపకపోవడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని, అలాంటి వారిని ఎన్నుకోవడం మన దరిద్రమని తెలిపారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు లేవని, కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని ఊసే లేదని చెప్పారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విజయ్ మాట్లాడారు. దేశానికి తిండి పెట్టే రైతులకు, వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. అనంతరం వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ మాట్లాడుతూ... బడ్జెట్‌లో మార్పులు చేసి నిధులు కేటాయించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు కె.లింగన్న, రైతు సంఘం జిల్లా నాయకులు జి.ఆంజనేయులు, ఎ.కృష్ణ, పి.బాలపీర పాల్గొన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్...

- మోగిన మండలి నగారా
- పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు ఎన్నికలు
- ఈనెల 16న నోటిఫికేషన్ విడుదల
- 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- నిలిచిపోయిన వైఎస్ఆర్ పెళ్లికానుక, షాదీ తోఫా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు కానీ, ఎలాంటి ప్రారంభోత్సవాలు కానీ నిర్వహించరాదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న వైఎస్ఆర్ పెళ్లి కానుక, షాదీ తోఫా నిలిచిపోయాయి.

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చిలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పదవీ కాలం ముగియనుంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 16న శాసనమండలి స్థానాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లను ఈనెల 23 వరకు స్వీకరిస్తారు. 24న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ 27 వరకు ఉంటుంది. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మార్చి 13న పోలింగ్ జరుగుతుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 16న కౌంటింగ్ నిర్వహించనున్నారు. మార్చి 21 నాటికి మండలి ఎన్నికల ప్రక్రియను పూర్తి కానుంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనంతపురం కలెక్టర్ వ్యవహరిస్తారు. సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారు. ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా కూడా సిద్ధం చేశారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 61,884 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 42,097 మంది పురుషులు, 19,586 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో 5,364 మంది ఓటర్లు ఉండగా, 2,963 మంది పురుషులు, 2,831 మంది మహిళలు ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ నియోజక వర్గ పరిధిలో 25 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం గుర్తించింది. వచ్చే వారంలో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఈ నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదు చేసుకోలేని ఓటర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనుంది.

ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులు

ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి డాక్టర్ పోతుల నాగరాజు పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. వైసిపి అభ్యర్థిగా వెన్నపూస రవిచంద్ర రెడ్డి బరిలో ఉన్నారు. టిడిపి తరపున భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్మూరు నాగరాజు, మరికొంతమంది బరిలో నిలిచారు. ఉపాధ్యాయ మండలి స్థానానికి పిడిఎఫ్ బలపరిచిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పోటీ చేస్తున్నారు. వైసిపి మద్దతుతో ఎంవి.రామచంద్రారెడ్డి బరిలో ఉన్నారు. వీరితోపాటు ఎపిటిఎఫ్, ఇతర సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా డాక్టర్ చామల అనిల్ వెంకట సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం తరపున జివి.నారాయణ రెడ్డి, బహుజన్ టీచర్స్ అసోసియేషన్ తరపున రామశేషయ్య బరిలో నిలిచారు. ఇంకా మరి కొంతమంది అభ్యర్థులు కూడా నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి పెరిగే అవకాశం ఉంది.

మండలి ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించాలి

శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్, జెసి, ఇతర అధికారులతో శాసనమండలి ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలు పక్కాగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జెసి రామసుందర్ రెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఎక్కడా ఉల్లంఘించకుండా చూడాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఈనెల 11న జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కోరారు. గురువారం ఆయన బి.తాండ్రపాడు దగ్గర ఉన్న కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోక్ అదాలత్‌లో భాగంగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన కక్షిదారులు, ఇరుపక్షాల వారికి ఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల్లోని కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇరు పక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నోటీసులు అందిన కక్షిదారులు వారి కేసులను లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలని కోరారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే సమయం వృథా కాదని, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న, చిన్న విషయాలకు ఘర్షణలు పడిన కేసులు పేరుకు పోయాయని, రాజీ అయి కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. కేసుల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రాజీ అయ్యే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పెండింగ్ కేసులను తగ్గించాలని తెలిపారు. విలేజ్ విజిట్‌లు పెంచాలన్నారు. కర్నూలు తాలూకా సిఐ రామలింగయ్య, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, మన్మథ విజయ్ ఉన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

రోడ్డు ప్రమాదంలో 30 గొర్రెలు, మేకలు మృతి

- నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి
- గొర్రెల పెంపకందారుల సంఘం, వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 30 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయని, బాధిత రైతులను ఆదుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి గోవిందు, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. మృతి చెందిన గొర్రెలకు, మేకలకు వైద్యాధికారులు డాక్టర్ మనోజ్ కుమార్ గురువారం పంచానామా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు, నాగన్న మాట్లాడారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన కురువ రామమద్దయ్య, కురువ ఎల్లాస్వామికి చెందిన గొర్రెల గుంపు ఓర్వకల్లు టూరిజం హోటల్ దగ్గర రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఐషర్ వాహనం వాటిపై దూసుకెళ్లిందని తెలిపారు. ఈ ప్రమాదంలో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయని వాపోయారు. ఇంకో పది గొర్రెలు గాయపడ్డాయని, పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. 30 గొర్రెలు మృతి చెందడంతో బాధిత రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. 30 గొర్రెలకు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వైఎస్ఆర్ పశు నష్టపరిహార పథకం కింద ఒక్కో జీవానికి రూ.6 వేలు నష్టపరిహారంగా ఇచ్చేదన్నారు. జనవరి 1 నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. దీని వల్ల ప్రస్తుతం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జీవాలకు ప్రభుత్వ సహాయం అందదని, దీని స్థానంలో ప్రభుత్వం జిఒ 3 విడుదల చేసిందని చెప్పారు. దీని ప్రకారం ఇన్స్యూరెన్స్ చేసుకున్న జీవాలకు మాత్రమే నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిఒ 3ను రద్దు చేసి వైఎస్ఆర్ పశు నష్ట పరిహార పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓర్వకల్ మండల పోలీసు స్టేషన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. స్థానిక విఆర్ఒ పంచనామా నిర్వహించారు. మాదాసి, మదారి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న, బాధితులు కురువ రామ మద్దయ్య, కురువ ఎల్లాస్వామి, కిష్టాపురం పెద్ద మద్దయ్య, చిన్న ఎల్లు, మధు, మద్దు పాల్గొన్నారు.



మృతి చెందిన గొర్రెలకు పంచనామా నిర్వహిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్



సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

సిఎంను కలిసిన ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్ ఖాన్ గురువారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూల్ నగరంలో రూ.16.23 కోట్లతో రహదారుల విస్తరణ పనులకు అభివృద్ధి నిధులు మంజూరు చేసినందుకు, బుధవారం క్యాబినెట్ సమావేశంలో నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు సిఎం జగన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కర్నూలు నగర అభివృద్ధి గురించి పలు అంశాలపై సిఎంతో చర్చించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి కర్నూలు నగర అభివృద్ధికి తన దృష్టికి తెచ్చినా సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

11న హైకోర్టు జడ్జి గంగారావు రాక

ప్రజాశక్తి - తుగ్గలి

మండలం పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11న జరుగుతున్న పూర్వపు విద్యార్థుల సమ్మేళనానికి హైకోర్టు జడ్జి గంగారావు హాజరవుతున్నట్లు పూర్వపు విద్యార్థి విద్యార్థి, టీడీపీ సీనియర్ నాయకులు కారం భాస్కర్ రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను చదువుకున్న పాఠశాలకు ఏదో విధంగా సహాయ పడాలనే తపనతో జడ్జి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

జెఇఇలో టౌన్ మోడల్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్స్ మొదటి విడత అర్హత ఎంపిక పరీక్షలో కర్నూల్ నగరంలోని టౌన్ మోడల్ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచారు. ఎల్.చరణ్ కార్తీక్ 98.84 పర్సెంటేజీతో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ సి.సుంకన్న తెలిపారు. గురువారం కళాశాలలో విద్యార్థి ఎల్.చరణ్ కార్తీక్‌ను అభినందించారు.



విద్యార్థికి అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపల్ సుంకన్న, అధ్యాపకులు

గ్రౌండ్ ట్రూథింగ్ పనులు పూర్తి చేయాలి

- భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రౌండ్ ట్రూథింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం అమరావతి నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూపరిపాలన ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో డ్రోన్ ఫ్లై చేసే ముందు డ్రోన్ కంట్రోల్ పాయింట్స్ మార్క్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలా మార్క్ చేసుకోవడం వల్ల డ్రోన్ కెమెరాల ద్వారా తీసిన ఫొటోలను అభివృద్ధి చేసి ఓఆర్ఐలు ఇవ్వడం జరుగుతుందని, వాటిని బట్టి క్షేత్రస్థాయిలో సర్వే బృందాలు నిజ నిర్ధారణ, రైతుల సమక్షంలో గ్రౌండ్ వాలిడేషన్ చేపడతారని వివరించారు. ఒక వేళ ల్యాండ్ పాయింట్స్ మార్క్ చేయకుంటే డ్రోన్ ఫ్లై అయిన తర్వాత ఓఆర్ఐ ఖచ్చితంగా రాదని పేర్కొన్నారు. కొన్ని జిల్లాలో చెక్ పాయింట్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రతి జిల్లా కలెక్టర్ డ్రోన్ ఫ్లై కి సంబంధించిన అంశాలన్నీ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూథింగ్ చేసే సమయంలో నోటీసులు తప్పకుండా ఇవ్వాలని, అలాగే ఎన్ని గ్రామాల్లో పూర్తి చేశారు ,ఇంకా ఎన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కలెక్టర్లు మానిటర్ చేయాలని పేర్కొన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్ త్వరితగిన పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్ చేసిన తర్వాత 9(2),10(2) నోటీసులు ఏమైనా వస్తే వాటిని త్వరితగతిన డిస్పోజ్ చేయాలన్నారు. అదే విధంగా సెక్షన్ 13 నోటిఫికేషన్‌కి సంబంధించిన డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌లను కూడా డిస్పోజ్ చేయాలన్నారు. ఫైనల్ ఆర్ఓఆర్‌లను గ్రామ సభలో పెట్టే సమయంలో అందుకు సంబంధించిన వీడియోలను తీసి ఆర్డీఓ కార్యాలయంలో భద్రపరచాలని కోరారు. పెండింగ్ లో ఉన్న డిజిటల్ సంతకాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ల్యాండ్ కన్వర్షన్‌కి సంబంధించిన పనులు కొన్ని జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించా లని ఆదేశించారు. సమావేశంలో జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - మద్దికెర

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రమీజాబి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మద్దికెరలో సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలో ఢిల్లీ ధర్నా కార్యక్రమానికి ఆశా వర్కర్లు ఎక్కువ మంది కదిలేలా చూడాలన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల జీతం ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, ఇన్సూరెన్స్ చెల్లిస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ పెన్షన్ ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లను సచివాలయముకు సంబంధం లేకుండా ఇంకా తదితర డిమాండ్లపై చలో ఢిల్లీ మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు చాముండి, ద్రాక్షాయని, అపర్ణ, భూలక్ష్మి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమీజాబి

శివరాత్రి సందర్భంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కర్నూలు జిల్లాలోని 5 డిపోల నుండి శ్రీశైలం, ఇతర శైవ క్షేత్రాలకు రద్దీకి అనుగుణంగా 258 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కర్నూలు ప్రజా రవాణా అధికారి టేకి వెంకట్రామం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదోని నుండి శ్రీశైలంకు 67, పత్తికొండ నుండి శ్రీశైలంకు 4, కర్నూలు నుండి శ్రీశైలంకు 110, శ్రీశైలంకు 62 బస్సులను నడుపుతున్నామని తెలిపారు. అలాగే ఇతర శైవ క్షేత్రాలకు కర్నూలు నుండి జగన్నాథగట్టుకు 3, అలంపూర్‌కు 5, ఎమ్మిగనూరు నుండి గురజాల 7 బస్సులను తిప్పుతున్నామని పేర్కొన్నారు. కాలినడకన శ్రీశైలం వెళ్ళు భక్తుల సౌకర్యార్థం ఈ నెల 13వ తేది నుండి కర్నూలు-వెంకటాపురం మధ్య ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు చెప్పారు. కర్నూలు, నంద్యాల జిల్లాల బస్సులకు అదనంగా 220 బస్సులను ఇతర జిల్లాల నుండి తెప్పించనున్నట్లు తెలిపారు. వీటిలో 145 బస్సులు కర్నూలు జిల్లాకు, 75 నంద్యాల జిల్లాకు కేటాయించామన్నారు. కావున ప్రయాణీకులు భద్రత లేని ప్రైవేటు వాహనాలలో ప్రయాణించకుండా, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించాలని కోరారు.

ప్రయాణ టికెట్లతో పాటు దర్శన టికెట్లు

ఎపి ప్రజా రవాణా విభాగం (ఆర్టీసి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల సందర్శన కోసం వెళ్లే భక్తులకు సులభతర ప్రయాణం, ఆలయాల దర్శనం సజావుగా సాగేందుకు వీలుగా అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా శ్రీశైలం వెళ్ళే భక్తులకు దైవదర్శనం కల్పించేందుకు దేవదాయశాఖ సమన్వయంతో, ప్రత్యేక ప్యాకేజీ గురువారం నుండి అమలులోకి తెచ్చింది. స్పర్శ, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం కోసం భక్తులు తమ ప్రయాణ టిక్కెట్టుతో పాటు, దర్శనం టిక్కెట్టు కూడా పొందవచ్చు. ప్రతి రోజు దేవదాయ శాఖ ఆర్టీసికి 1075 దర్శన టిక్కెట్లు అందుబాటులోకి తెస్తుంది.

దర్శన వేళలు, టిక్కెట్లు వివరాలు : దర్శన సమయం ఉదయం 6 గంటలకు అతి శీఘ్ర దర్శనం టిక్కెట్టు ఖరీదు 300 రూపాయలవి 100 టికెట్లు, శీఘ్ర దర్శనం రూ.150ల టిక్కెట్లు 150, సమయం ఉదయం 10 గంటలకు అతి శీఘ్ర దర్శనం రూ.300ల టికెట్లు 100, శీఘ్ర దర్శనం రూ.150ల టికెట్లు 200 మాత్రమే. అయితే బ్రహ్మోత్సవాల సందర్భంగా శీఘ్ర దర్శనం 200 రూపాయలు, అతి శీఘ్ర దర్శనం రూ.500లుగా నిర్ణయించారు. ఈ టికెట్లు రద్దు చేసుకునే అవకాశం లేదు. భక్తులు ఆర్టీసీ వారు కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు.



సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీస్తున్న ప్రజలు

కొత్తకోటలో ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- గడపగడపలో నిలదీతలు
- మధ్యాహ్నంలోపే వెళ్లిపోయిన వైనం

ప్రజాశక్తి - బెళగల్

మండలంలోని కొత్తకోటలో గురువారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ గడపగడప కార్యక్రమం చేపట్టారు. మొదటి రోజే పలు సమస్యలపై ప్రజలు నిలదీస్తుండటంతో చేదు అనుభవం ఎదురైంది. ఇసుక లారీల రాకపోకలతో రోడ్లు ధ్వంసమయ్యాయని, పట్టణాలకు, ఇతర పల్లెలకు బస్సులు లేక అవస్థలు వర్ణనాతీతంగా మారినా పట్టించుకున్న పాపాన లేదని గ్రామస్తులు వాపోయారు. 40 ఏళ్ల కాలంలో ఏనాడూ బస్సు కల తప్పలేదని, అలాగే స్వంత వాహనాలు, ఇతర వాహనాలు వెళ్ళుటకు వీలుగాలేని రోడ్డుతో నరకయాతన పడుతున్నాని ఆవేదన చెందారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీరు అస్తవస్థంగా ఉందని వినతులు ఇచ్చినా స్పందన కరువైందని విన్నవించారు. ఈ గడప గడపతోనైనా చర్యలు చేపట్టాలని, లేదంటే ఈ కార్యక్రమం జరపనివ్వమంటూ నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే సమాధానం చెప్పకుండానే కేవలం బిసి కాలనీని చుట్టేసి మధ్యాహ్నంలోపే వెళ్లిపోవడంపై విమర్శలు వెలువెత్తాయి.

మైనార్టీ సంక్షేమ అధికారిగా సబిహా పర్వీన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిగా సబిహా ఫర్విన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆమె బాధ్యతలను స్వీకరించిన అనంతరం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమెకు రిటైర్డ్ తహశీల్దార్లు రోషన్ అలీ, అజయ్ కుమార్, మైనార్టీ సంఘాల నాయకులు కుద్రతుల్లా ఖాద్రీలు కలిసి అభినందనలు తెలియజేశారు

ఉరుసు సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు పట్టణంలో ఉరుసు సందర్భంగా అన్నదాన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ భాగ్యరత్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, డాక్టర్ షాకీర్ అహ్మద్, మాజీ సర్పంచ్ రాంబాబు గౌడ్ దంపతులు, డాక్టర్ షబ్బీర్ అహ్మద్ ఇనూస్, జిలాని దర్గా పీఠాధిపతులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.

పన్ను చెల్లించుకుంటే తాళమే

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆస్తి, నీటి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని అవగాహన కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. సకాలంలో పన్ను చెల్లించని దుకాణాలకు గురువారం మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష ఆధ్వర్యంలో ఉద్యోగులు తాళాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.17 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గ్రామ వార్డుల్లో పన్ను సకాలంలో చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను పురవాసులకు వివరిస్తున్నామని చెప్పారు. మొండి బకాయి దారులు 15 మందిని గుర్తించామని, వారందరికీ ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తెలిపారు. బకాయిలు చెల్లించని వారిని గుర్తించి వారి వద్దకు వెళ్లి వసూలుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అప్పటికీ చెల్లించకపోతే తాళం వేస్తున్నామని, ఆ పరిస్థితి వరకు రానివ్వ వద్దని సూచించారు. సకాలంలో పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లవకుమార్, శ్రీనివాసులు, సూర్య బాబు, వార్డు అడ్మిన్ రమేష్, ఉద్యోగులు ఉన్నారు.



దుకాణానికి తాళం వేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

నిక్షయ మిత్రులుగా చేరండి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

పేద క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారమందించి ఆదుకునేందుకు నిక్షయ మిత్రులుగా చేరాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ టివి.బాల మురళీకృష్ణ కోరారు. టిబి ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం ఆది మిత్ర బృందం, టిబి క్లీనిక్ సిబ్బంది సంయుక్తంగా 15 మంది పేద క్షయ వ్యాధిగ్రస్తులకు రూ.700 విలువ చేసే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద టిబి వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి టిబి రహిత సమాజానికి కృషి చేయాలని కోరారు. నిక్షయ మిత్రులుగా చేరేందుకు ఆదోని టిబి క్లీనిక్ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకూన్ బీ, పిపిఎం కోఆర్డినేటర్ డి.ఉమాపతి, బాబు రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ బాల మురళీకృష్ణ

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- ఎంపిడిఒ సుధాకర్ రాజు, హౌసింగ్ డిఇ ఆదినారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ సుధాకర్ రాజు, హౌసింగ్ డిఇ ఆది నారాయణ సూచించారు. గురువారం మండల కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏరూరు గ్రామంలో జగనన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డిఇ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను త్వరగా పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్మాణంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకొని లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం సిమెంటు, స్టీలు, ఇసుక అందిస్తుందన్నారు. బిల్లులు కూడా సకాలంలో మంజూరవుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులు వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. హౌసింగ్ అధికారులు భవ్య, అంజలి, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న పాల్గొన్నారు.



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న మండల అధికారులు

'శ్రీశైలం భక్తులకు స్పర్శ దర్శనం కల్పించాలి'

ఆదోని : మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వచ్చే భక్తులకు స్పర్శ దర్శనం కల్పించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ సంఘం నాయకులు బద్రినాథ్ స్వామి, వెంకట్ రాముడు, సురేష్ గౌడ్ కోరారు. గురువారం వారు ఆదోనిలో మాట్లాడారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఎపి, తెలంగాణ ప్రాంతాల నుంచి ఈనెల 18న జరిగే శివరాత్రి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. వారందరికీ నేరుగా స్పర్శ దర్శనం కల్పించే విధంగా దేవస్థానం పాలకమండలి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామీణ రోడ్లు... గుంతలమయం

- పట్టించుకోని పాలకులు, అధికారులు - ఇబ్బందుల్లో ప్రయాణికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ గుంతలమయమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హోళగుంద నుంచి ఆలూరుకు వెళ్లాలన్నా, ఆదోని నుంచి హోళగుందకు చేరుకోవాలన్నా, కర్ణాటక సరిహద్దు గ్రామం మార్లమడికి రోడ్డు కర్ణాటక సరిహద్దులోకి అడుగు పెట్టడానికి 5 కిలోమీటర్లు మాత్రమే ఉంది. ఈ రోడ్లన్నీ గుంతలమయమై ఉండడంతో ఎక్కడికి వెళ్లాలన్నా సమయం వృథా అవుతోంది. నానా ఇబ్బందులు పడి గమ్యస్థానానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మార్లమడికి రోడ్డు భూమిపూజకే పరిమితమైంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం వైసిపి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత మార్లమడికి రోడ్డుకు నిధులు కేటాయించామని, రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని, సంబంధిత శాఖాధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఇంతవరకూ నిర్మాణానికి నోచుకోలేదు. మంత్రి శంకుస్థాపన చేశారని, ఇక రోడ్డు పనులు పూర్తవుతాయని మండల ప్రజలు భావించారు. భూమి పూజ చేసి రెండేళ్లయినా పనులు మొదలు పెట్టకపోవడంతో మండల ప్రజలు మండిపడుతున్నారు. హోళగుంద నుంచి ఢణాపురం రోడ్డు కోసం రూ.69 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారులతోపాటు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభమవుతాయో లేదోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు సార్లు కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టడానికి వచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలు పర్సెంటేజ్ అడగడంతో సందిగ్ధంలో పడ్డారు. వారికి పర్సెంటేజీలు ఇవ్వాలా.., నాణ్యతగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలా అని వెనక్కి తిరిగి వెళ్లినట్లు తెలిసింది. హోళగుంద మండలానికి చేరుకోవాలంటే ఏ రోడ్డులో చూసినా గుంతలు ఉండడంతో గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి, కర్నూలు వంటి జిల్లా కేంద్రాలకు వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బిటి రోడ్డు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమమయమైన రోడ్డు

సామాజిక ఉద్యమనేతల గెలుపునకు కృషి

- ప్రజాసంఘాల ప్రచారం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపునకు కృషి చేస్తున్నట్లు ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు భాస్కర్ యాదవ్, ఎం.రాజు, వీరేష్ తెలిపారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థి సంఘం నేతగా సమస్యలపై ఉద్యమిస్తూ, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా 28 ఏళ్ల పాటు పని చేసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నేతగా అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారని తెలిపారు. పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు సామాజిక స్థాయి నుంచి విద్యార్థి నేతగా ఎదిగి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి జైలు జీవితాలు గడిపిన ఉద్యమనాయకుడని చెప్పారు. 2007లో సామాజిక ఉద్యమాల కోసం ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి సామాజిక పోరాటానికి జీవితాన్ని అంకితం చేసిన పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. నాయకులు వీరేష్, నాయకులు జీవన్, పురుషోత్తం, మల్లికార్జున, తిక్కన, హనుమంతు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కుల వివక్షత సామాజిక నేరం...

- సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణు గోపాల్ రాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

కుల వివక్షతను సామాజిక నేరంగా పరిగణిస్తున్నట్లు సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణు గోపాల్ రాజు తెలిపారు. గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కెవిపిఎస్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక, ఆర్థిక రంగంలో అభివృద్ధి చెందాలని తెలిపారు. కులవివక్ష విడనాడి ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. వివక్ష చూపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జయరాజు, మండల అధ్యక్షులు ఎస్.వీరేష్, మండల కార్యదర్శి బి.అనిల్, నాయకులు కె.రాజు, బుజ్జి, ప్రభు, జాన్ పాల్గొన్నారు.

పండ్ల తోటలతో అభివృద్ధి : రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద సాగు చేసుకున్న పండ్ల తోటలతో అభివృద్ధి చెందామని మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన పండ్ల తోటల రైతులు కౌలుట్లమ్మ, బలరాం నాయుడు తెలిపారు. గురువారం సిఆర్‌డిఎ నుంచి వచ్చిన అధికారులు వారితో ముఖాముఖి చర్చించి ఫిల్మ్ షూట్ తీశారు. ఈ సందర్భంగా పండ్ల తోటలను పరిశీలించారు. ఏపీడీ పద్మావతి, ప్లాంటేషన్ మేనేజర్ నందకుమార్, సిడి నాయక్, ఎపిఒ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపిపిపై చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్‌కు జర్నలిస్టుల వినతి

ప్రజాశక్తి-ఆలూరు

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సి.బెళగల్ ఎంపిపి బొంతల మునెప్పపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు నాయకులు చంద్రమోహన్, రాజు, బద్రి కోరారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, తహశీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సి.బెళగల్‌లో బుధవారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమంలో ఎంపిపి మునెప్ప జర్నలిస్టులను అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దుర్భాషలాడారని తెలిపారు. ఎంపిపిపై చర్యలు తీసుకొని పదవి నుంచి తొలగించాలని కోరారు. నిస్వార్థంగా ఉన్నది ఉన్నట్టు వార్తలు రాస్తే మింగుడు పడని కొందరు దుర్భాషలాడడం, దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సోము, కృష్ణ, రాంప్రసాద్, గోపాల్, ముని, కన్నా, కిరణ్, బాష పాల్గొన్నారు.



టీ షర్టులు అందజేస్తున్న రూరల్ సిఐ మోహన్ రెడ్డి

అన్నదాన సభ్యులకు టీ షర్టుల అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నల్లమల్ల అడవిలో ఉన్న నాగలూటీ వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం చేసే సభ్యులకు మేఘన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో టీ షర్టులను అందజేశారు. గురువారం ఎమ్మిగనూరు గ్రామీణ సిఐ కె.మోహన్ రెడ్డి చేతుల మీదుగా 30 టీ షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిఐ కె.మోహన్ రెడ్డిని మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి, శివ స్వాములు శాలువా, పూల కుండితో సన్మానించారు. అనంతరం సిఐ మాట్లాడారు. టీ షర్టులు స్పాన్సర్ చేసిన వీరారెడ్డిని అభినందించారు. బుల్లెట్ అంజి స్వామి పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



ట్యాప్ తిప్పి నీటిని వదులుతున్న సర్పంచి

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి ఎస్సీ కాలనీలో చాలాకాలంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. విషయం తెలుసుకున్న సర్పంచి (టిడిపి) మల్లికార్జున సమస్యను పరిష్కరించారు. గ్రామంలో నూతనంగా పైపులైన్ అమర్చి సిమెంట్ ట్యాంకును కట్టి ఎస్సీ కాలనీ ప్రజల నీటి కష్టాలు తొలగించారు. సమస్య తన దగ్గరికి రాగానే అతి తక్కువ సమయంలోనే పరిష్కరించినందుకు గురువారం ఎస్సీ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని భూగర్భ మురుగు కాల్వ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. గీతా నగర్ లోని గాయత్రీ దేవి గుడి పక్క సందులో ఉన్న రేషన్ దుకాణం వద్ద మ్యాన్ హోల్ ధ్వంసమైంది. అక్కడ వాహన చోదకులకు, పాదచారులకు రాత్రి సమయాల్లో ఇబ్బంది కలుగుతోంది. మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ధ్వంసమైన మ్యాన్ హోల్

'అప్పర్ భద్ర'పై స్పందించకపోవడం సిగ్గుచేటు

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదిపై నిర్మిస్తున్న 'అప్పర్ భద్ర' గురించి రాయలసీమ జిల్లాల వైసిపి ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం సిగ్గు చేటని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అప్పర్ భద్ర' నిర్మాణం వల్ల రాయలసీమ ప్రాంత ప్రజలకు అన్యాయం జరుగుతుందని వారికి తెలియదా అని ప్రశ్నించారు. ఇంత అన్యాయం జరుగుతుంటే రాయలసీమ ప్రాంతంలో ఉన్న వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్న సాగు, తాగు నీరు కూడా రాబోయే రోజుల్లో రాకుండా కర్ణాటక ప్రభుత్వం 'అప్పర్ భద్ర' నిర్మాణం చేపడుతోందని తెలిపారు. ఇక్కడేమో ఆర్‌డిఎస్ పనులు నిలిచి పోయాయని చెప్పారు. అసెంబ్లీలో ఏ ఒక్క ఎమ్మెల్యే కానీ, పార్లమెంటులో ఎంపీలు కానీ ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఆర్‌డిఎస్ పనులకు టిడిపి హయాంలో రూ.కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కనీసం ఆ పనులు కూడా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నుంచి 90 శాతం మంది ప్రజలు, రైతులు వలస వెళ్లారని తెలిపారు. ఇకనైనా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో, ఎంపీలు పార్లమెంటులో గళం విప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్, వడ్డే రామయ్య, సూగూరు నాగేష్, లక్ష్మీకాంత్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, నాయకులు మారెప్ప, ఈరేష్, బొడ్డన్న, శివ, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న కాల్వ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగిలో కొలువైన శ్రీరేణుక ఎల్లమ్మ దేవిని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు టిడిపి బీసీ సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, చింతలగేరి నర్సారెడ్డి స్వాగతం పలికారు. ఈనెల 11న కోసిగిలో శ్రీరేణుక ఎల్లమ్మ రథోత్సవం సందర్భంగా కాల్వ శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ అర్చకులు పూజారి అయ్యన్న గౌడ్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి ఇంట్లో తేనేటి విందుకు హాజరయ్యారు. టిడిపి నాయకులు రణ తిక్కన్న, గాలెం వీరేష్, నరసన్న, హీరో షోరూం వీరేష్, హోటల్ వీరేష్, పోతుల వీరారెడ్డి, బుజ్జి, సొట్టయ్య, గణపతి, తిక్కస్వామి, తిక్కారెడ్డి, మాదేవా, రామిరెడ్డి ఉన్నారు.

నేడు కొత్తపేట మస్తాన్ వలీ ఉరుసు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం మస్తాన్ వలీ దర్గా ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరగనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా దర్గాను రంగులతో, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు కర్నూలు జిల్లా నుంచే గాక అనంతపురం, హైదరాబాద్, బళ్లారి, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఉత్సవాల్లో భాగంగా అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సచివాలయ కన్వీనర్ బాబు, నిర్వాహకులు మస్తాన్, తిక్కయ్య తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మట్టి రహదారిపై సర్పంచి షేకమ్మ కుమారుడు, సచివాలయ కన్వీనర్ బాబు ట్రాక్టర్ ట్యాంకుతో నీటిని చల్లించారు. దుమ్ము లేవకుండా ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



గ్రామీణ క్రీడలు దేశానికి పట్టుకొమ్మలు...

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి

ప్రజాశక్తి- కోసిగి రూరల్

గ్రామీణ క్రీడలు దేశానికి పట్టుకొమ్మలని, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చి కాపాడే బాధ్యత మనందరిదని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, యువనేత ధరణీ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా కోసిగిలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముందుగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌రెడ్డి మాట్లాడారు. నేటి ఆధునిక కాలంలో గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని తెలిపారు. ఆటలను ప్రాచుర్యంలోకి తీసుకు రావాలని చెప్పారు. అనంతరం మురళీ మోహన్‌రెడ్డి ఆటల్లో పాల్గొని ఉత్సహ పరిచారు.

బహుమతుల ప్రదానం : అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా మురళీమోహన్ రెడ్డి హాజరయ్యారు. కడప, ఉరవకొండ జట్ల మధ్య రసవత్తరంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో కడప విజేతగా నిలిచింది. మొదటి బహుమతి కడపకు రూ.15 వేలు, రెండో బహుమతి ఉరవకొండకు రూ.10 వేలు, మూడో బహుమతి ఆత్మకూరుకు రూ.5 వేలు, నాలుగో బహుమతి కోసిగికి రూ.3 వేలు అందజేశారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్న నేపథ్యంలో కోసిగి జట్టుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తనయుడు, యువనేత ధరణి రెడ్డి సహకారంతో మురళీ మోహన్ రెడ్డి క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. ఎంపిపి ఈరన్న, నాడిగేని నరసింహులు, మహంతేష్ స్వామి, ఎన్.నాగరాజు, మంగమ్మ, జగదీష్ స్వామి, మాణిక్యరాజు, హాజీ ఉస్మాన్, సోఫీ, మల్లయ్య, బుళ్లి నరసింహులు, వందగల్లు లక్ష్మయ్య, కొరివి నాగరాజు, హెచ్ఎం కృష్ణమూర్తి, పీడీ ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

విదేశీ విద్యపై ఆంక్షలు ఎత్తివేయాలి

- టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

విదేశీ విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు బొగ్గు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉన్న అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం జగనన్న విద్యా పథకంగా పేరు మార్చి ఆంక్షలు విధించి పేదలకు విదేశీ విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యపై ఆంక్షలను రద్దు చేసి గతంలో మాదిరిగా విదేశీ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిఎన్ఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మునిప్రభ, చాంద్‌బాషా, అష్రాఫ్, అనోక్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తహశీల్దార్ వెంకట లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు బెస్త జయ సూర్య, జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ్ మాట్లాడారు. కర్నూలు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు అయ్యన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లి, తెలుగు మహిళ నాయకులు శాంతి, అంజు సి.గాంధీ, నూర్జహాన్, ఆదిలక్ష్మి, టిడిపి నాయకులు గణేకల్ విరుపాక్షి, జగదీష్, వీరేష్, షణ్ముఖ, నాయకులు రమేష్, నాగరాజు, గౌతం, గణేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని హత్తిబెళగల్ గ్రామానికి చెందిన గంటే ఈరన్న (43) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... బుధవారం ఇంటి నుంచి చిప్పగిరికి వెళ్లిన ఈరన్న రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గాలింపు చేపట్టారు. హత్తిబెళగల్ గ్రామ సమీపంలోని అరవంటి వంక దగ్గర మృతి చెందినట్లు గుర్తించారు. మృతుని దగ్గర పురుగు మందు డబ్బాను గుర్తించారు. మృతునికి భార్య ఎల్లమ్మ, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు...

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో రాత్రి వేళల్లో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ డ్రైవర్లకు నిద్ర లేకుండా చేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో నలుగురు నిందితులు, దొంగలించిన 14 బైకులు, 60 సెల్ ఫోన్లు, మారణాయుధాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. గతనెల 24న ఆదోని, ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గరలో రోడ్డు పక్కన ఉన్న లారీలో నిద్రపోతున్న నంద్యాలకు చెందిన డ్రైవర్ పురుషోత్తం నుంచి సెల్ ఫోన్, రూ.5 వేల నగదును ముఠా దొంగలించుకు పోతుండగా లారీ డ్రైవర్ ప్రేమేష్ వెంటబడి పట్టుకున్నారని తెలిపారు. రెండో వ్యక్తి వర్ష తన దగ్గర ఉన్న కత్తితో డ్రైవర్‌ను విచక్షణ రహితంగా పొడిచి అక్కడ నుంచి నలుగురు పారిపోయి ఓ ఎస్టేట్‌లో దూరి ఇంటి వద్ద ఉన్న రెండు మోటార్ సైకిళ్లను దొంగలించారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఆదోని త్రీ టౌన్ సిఐ శ్రీరాం, ఎస్ఐ వీరశేఖర్ సిబ్బందితో కలిసి ముఠాను పట్టుకున్నారని తెలిపారు. గతంలో కూడా వీరు ఎన్నో దొంగతనాలు, నేర కేసుల్లో నిందితులుగా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా పోలీసులను అభినందించారు.



నిందితులు, మారణాయుధాలు, బైకులను ప్రవేశపెడుతున్న డీఎస్పీ

ఉద్యోగులకు జీతాలివ్వలేని వైసిపి

- మాజీ ఎమ్మెల్యే బీవీ - నెరుడుప్పలలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రజలకు సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు అందించలేని పరిస్థితిలో ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం ఉందనిటిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని నెరుడుప్పల గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. బీవీ గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ టిడిపి హయాంలో అందజేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలన తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపిని ఆదరించాలని కోరారు.



టిడిపి నాయకుని పరామర్శిస్తున్న బీవీ

రామాంజనేయులుకు పరామర్శ, ఆర్థిక సాయం

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి గ్రామ నాయకుడు, మాజీ సర్పంచి రామాంజనేయులు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ఆర్థిక సహాయం అందజేశారు.

కర్ణాటక భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - ఆస్పరి

మహాశివరాత్రి పండగ సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తులకు స్థానిక కర్నూలు రోడ్డు సమీపంలోని శ్రీఫక్కీరప్ప తాత దేవాలయం దగ్గర ఆస్పరి గ్రామస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు సేద తీరేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సౌకర్యం కల్పించారు. భక్తులకు అన్నదాన సౌకర్యం ఈనెల 15 వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు శాంతప్ప, నాగేష్, గాదిలింగ, మహానంది, రామిరెడ్డి, రాము, వీరేష్, నాగరాజు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న గ్రామస్తులు

దూదేకుల కమ్యూనిటీ కోసం స్థలం కేటాయింపు

ప్రజాశక్తి - కౌతాళం

దూదేకుల కమ్యూనిటీ కోసం 15 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగి రెడ్డి ఆదేశాల మేరకు స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. దేశాయ్ ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ధర్మకర్త సయ్యద్ మున్నా సాహెబ్, దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబా, రిటైర్డ్ తహశీల్దార్ షేక్షావలీ ఆధ్వర్యంలో మసీద్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఉప సర్పంచి తిక్కయ్య, సత్యప్ప స్వామి, చౌదరి బసవరాజు, వడ్డే రాముడు, వెంకోబా, అబ్దుల్ సమద్, రామకృష్ణ పాల్గొన్నారు.



మసీదు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు